RNI NO : TELTEL/2023/88524

మెదక్ టుడే
దిన పత్రిక

**మంచిమాట**


ఆలోచించు. కానీ సమయం మించిపోకముందే ఆలోచనను కట్టిపెట్టి ఆచరణకు దిగు.

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 239
శుక్రవారం, ఆగస్టు 14, 2026, పేజీలు - 4 వెల : 2/-

### కేంద్రానికి షాక్: ఏకంగా 5 కీలక బిల్లులు బంద్!

# ప్రతిపక్షాల వ్యూహాత్మక దెబ్బ..

**ఢిల్లీ:** నేటితో ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు భారత రాజకీయంలో ఒక కొత్త చర్చకు తెరలేపాయి. జులై 20న సమావేశాలు ప్రారంభమైన సమయానికి, బెంగాల్ ఎన్నికల ఫలితాలు , వివిధ పార్టీల ఎంపీల చేరికతో అధికార ఎన్డీఏ కూటమి పూర్తి ఆధిక్యంలో కనిపించింది. ప్రతిపక్షాలు తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం సభలో సులభంగానే తన అజెండాను నెరవేర్చుకుంటుందని విశ్లేషకులు భావించారు. కానీ, సభ ముగిసే సమయానికి సీన్ పూర్తిగా తిరగబడింది. విద్యార్థుల ఉద్యమం ఇచ్చిన మైలేజీని వ్యూహాత్మకంగా వాడుకున్న విపక్షాలు, పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని గట్టి డిఫెన్స్‌లో పడేశాయి. ఈ సమావేశాల్లో మోదీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ముందుకు తెచ్చిన అనేక బిల్లులు ప్రతిపక్షాల ఆందోళనల హోరులో కొట్టుకుపోయాయి. దేశ రాజకీయ చిత్రాన్ని మార్చే



నియోజకవర్గాల పునర్విభజన రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు.. 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్' బిల్లు, ఎఫ్‌సీఆర్ఏసవరణ బిల్లు, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్ స్టిట్యూట్ బిల్లు, అరెస్ట్ అయిన ప్రజాప్రతినిధుల తొలగింపు బిల్లులు ఆమోదం పొందలేకపోయాయి. ముఖ్యంగా డెలిమిటేషన్ విషయంలో డీఎంకే మద్దతు కూడగట్టాలని కేంద్రం భావించినప్పటికీ, కాంగ్రెస్ నాయకత్వంలో విపక్షాలు అమలు చేసిన పక్కా వ్యూహంతో ప్రాంతీయ పార్టీలేవీ ఎన్డీఏ వైపు మొగ్గు చూపలేకపోయాయి. ఫలితంగా లోక్‌సభ పర్ఫామెన్స్ కేవలం 19 శాతానికి, రాజ్యసభ 39 శాతానికి పడిపోయింది.దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన 'చలో సంసద్' పిలుపు ఈ సమావేశాలకు ప్రధాన మలుపుగా మారింది. నిరసన తెలుపుతున్న అహింసయుత విద్యార్థులపై పోలీసులు పెల్లెట్ తుపాకులు వాడారనే ఆరోపణలను ప్రతిపక్షాలు అస్త్రంగా మలచుకున్నాయి.

## మహిళలకు ఫ్రీగా ఆటోమేటిక్ కుట్టుమిషన్లు..

**ఒక్కోటి రూ.12 వేలు, ఈనెల 15 నుంచి దరఖాస్తులు**



**హైదరాబాద్, ఆగస్టు 13:** బీసీ మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టుమి షన్లను మహిళలకు ఉచితంగా పంపిణీ చేయ నున్నారు. ఒక్కో మిషన్ విలువ రూ.12 వేలుగా ఉండగా.. లబ్ధిదారులకు 100 శాతం సబ్సిడీపై అందించనున్నారు. ఈనెల 15 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.తెలంగాణలోని బీసీ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కీలక శుభవార్త అందించింది. మహిళలు ఇంటి నుంచే ఉపాధి పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఉచిత ఆటోమేటిక్ కుట్టుమిషన్లను అందించేందుకు ప్రభుత్వం కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు పేరుతో చేపట్టిన ఈ పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.19 లక్షల మంది బీసీ మహిళలకు ప్రయోజనం కల్పించనున్నారు.తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 కుట్టుమిషన్ల చొప్పున పంపిణీ చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో కుట్టుమిషన్ విలువ రూ.12 వేలు కాగా.. లబ్ధిదారుల నుంచి ఎలాంటి మొత్తం వసూలు చేయకుండా 100 శాతం సబ్సిడీపై అందజేయనున్నారు.

## త్వరలో బొగ్గు ఎక్స్ఛేంజ్..

**దేశమంతా ఒకే ధరకు బొగ్గు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

### రేవంత్.. నువ్వు ముఖ్యమంత్రివా లేక

# రియల్ ఎస్టేట్ ఏజెంటువా

**: హరీశ్ రావు**

**హైదరాబాద్, ఆగస్టు 13:** రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్



అయ్యారు.కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడికక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1 లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు.ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో వ్యక్తం చేశారు.

### ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో

## సుప్రీంకోర్టుకు రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసును విచారించాలని అలహాబాద్ కోర్టు.. సీబీఐ, ఈడీని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఆగస్టు 17వ తేదీన చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం విచారించనున్నది. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ఆస్తులపై సీబీఐ ఇచ్చిన వివరణ పట్ల గతంలో అలహాబాద్ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. విచారణకు చెందిన కొత్త అఫిడవిట్‌ను దాఖలు చేయాలని జూలై 20వ తేదీన లక్నో బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈడీ విచారణ సమయంలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏవైనా డాక్యుమెంట్లు సేకరించారా అని కూడా హైకోర్టు ప్రశ్నించింది. కర్నాటక నివాసి ఎస్ విఘ్నేశ్ సిసిర్ దాఖలు చేసిన రిట్ పిటీషన్ ఆధారంగా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. రాహుల్ గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉన్నట్లు కూడా గతంలో విఘ్నేశ్ ఓ పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

# స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చేశాయ్..

**రేవంత్, ఉత్తమ్ ఫోటోలు.. హోలోగ్రామ్, క్యూఆర్ కోడ్**

**హైదరాబాద్, ఆగస్టు 13:** తెలంగాణలో రేషన్ లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చేశాయి. ఈ క్రమంలోనే తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మోడల్ స్మార్ట్ రేషన్ కార్డును విడుదల చేసింది. పౌర సరఫరా వ్యవస్థను టెక్నికల్‌గా మరింత బలోపేతం చేసే దిశగా సర్కార్ ఈ కొత్త తరహా రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకువస్తోంది. డిజిటల్ ధ్రువీకరణ, ఆధునిక భద్రతా ప్రమాణాలతో రూపొందించిన ఈ స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారుల వివరాలను వేగంగా గుర్తించేలా ఉపయోగపడ నున్నాయి. ఆగస్ట్ 15 నుంచి ఈ స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేయనున్నారు.తెలంగాణలో అర్హులైన పేద కుటుంబాలకు కొత్త రూపంలో స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి రానున్నాయి.ఆహార భద్రత కార్డుల పంపిణీని మరింత ఆధునికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం




కొత్త డిజైన్‌తో స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించింది. ఈ కార్డుల నమూనాను ప్రభుత్వం విడుదల చేయడంతో వాటిలో ఉండే ప్రత్యేకతలపై ఆసక్తి నెలకొంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15వ తేదీన సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని అధికారికంగా ప్రారంభించనున్నారు.

# ఏపీలో అదానీ గ్రూప్ మరో భారీ పెట్టుబడి..

**చంద్రబాబుతో భేటీ, రూ.16 వేల కోట్లతో టైటానియం ప్లాంట్**

**శ్రీకాకుళం:** ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అదానీ గ్రూప్ మరో కీలక ప్రతిపాదన తీసుకొచ్చింది. శ్రీకాకుళం జిల్లాలో సుమారు రూ.16 వేల కోట్లతో టైటానియం ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ అంశంపై కరణ్ అదానీ నేతృత్వంలోని ప్రతినిధులు సీఎం చంద్రబాబుతో చర్చించారు. రాష్ట్రంలోని బీచ్‌శాండ్‌లో లభించే ఇల్మెనైట్‌ను వినియోగించి టైటానియం ఆధారిత ఉత్పత్తులను తయారు చేసే అవకాశాలను సమావేశంలో వివరించారు. దీంతో పాటు పలు ప్రతిపాదనలను కూడా సంస్థ ప్రతినిధులు ప్రభుత్వం ముందుంచారు.ఆంధ్రప్రదేశ్‌లో భారీ పారిశ్రామిక పెట్టుబడులకు మరో కీలక అడుగు పడింది. అదానీ గ్రూప్ రాష్ట్రంలో సుమారు రూ.16 వేల కోట్ల పెట్టుబడితో టైటానియం ప్లాంట్ ఏర్పాటు చేసే ప్రతిపాదనను ముందుకు తీసుకు వచ్చింది. శ్రీకాకుళం జిల్లాలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అంశంపై అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ ఎండీ కరణ్ అదానీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి



చంద్రబాబు నాయుడుతో సమావేశమై చర్చించింది. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో జరిగిన ఈ భేటీలో ఏపీలో లభించే బీచ్‌శాండ్ మినరల్స్‌కు విలువ జోడించి అధిక విలువ కలిగిన ఉత్పత్తులను తయారు చేసే అవకాశాలపై ప్రధానంగా చర్చ జరిగినట్లు ప్రభుత్వం వెల్లడించింది.కేవలం ఖనిజాలను మాత్రమే వెలికితీసి విక్రయించడం కాకుండా.. వాటిని రాష్ట్రంలోనే ప్రాసెస్ చేసి ఫైనల్ ఉత్పత్తులుగా మార్చడం ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి ఊతమివ్వాలని సీఎం చంద్రబాబు.. అదానీ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. బీచ్‌శాండ్‌లో లభించే ఇల్మెనైట్ ఖనిజాన్ని ప్రాసెస్ చేయడం ద్వారా టైటానియం స్లాగ్, టైటానియం డయాక్సైడ్, టైటానియం స్పాంజ్ వంటి ఉత్పత్తులను తయారు చేయవచ్చని అదానీ గ్రూప్ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు వివరించినట్లు తెలుస్తోంది.వాటికి పెయింట్స్, కోటింగ్స్, కాస్మెటిక్స్, ప్లాస్టిక్స్, పాలిమర్స్, యూవీ ప్రొటెక్షన్ ఉత్పత్తుల వంటి రంగాల్లో వినియోగం ఉంటుందని ముఖ్యమంత్రికి వివరించారు. అరుదైన భూఖనిజాల విషయంలో ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితిని తగ్గించేందుకు రాష్ట్రంలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు.. సంబంధిత అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సాంకేతిక భాగస్వామ్యాలను గుర్తించాలని ఆదేశించినట్లు ప్రభుత్వం తెలిపింది.టైటానియం ప్లాంట్‌కే పరిమితం కాకుండా విశాఖపట్నంలో పలు ప్రాజెక్టులపై కూడా అదానీ గ్రూప్ ప్రతినిధులు వివరాలు అందించారు.

## డొనాల్డ్ ట్రంప్ టీమ్ లో బిగ్ వికెట్ డౌన్




**అమెరికా:** అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసం.. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ నెల చివరి నాటికి ఆమె తన బాధ్యతల నుంచి తప్పుకోనున్నారు. ఈ విషయాన్ని ఆమె అధికారికంగా ప్రకటించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన వైట్‌హౌస్ మీడియా ప్రతినిధి బాధ్యతలను స్వీకరించిన వారిలో అత్యంత పిన్న వయస్కురాలిగా లీవిట్ నూతన రికార్డును లిఖించారు. తన ఇద్దరు చిన్న పిల్లలతో ఎక్కువ సమయం గడపాలనే ఉద్దేశంతోనే ఆమె ఈ వైట్‌హౌస్ నుంచి వైదొలగుతున్నట్లు వెల్లడించారు. 28 ఏళ్ల వయసున్న లీవిట్.. డొనాల్డ్ ట్రంప్ రెండో విడత ప్రమాణ స్వీకారం చేసిన ప్రారంభ రోజుల్లోనే వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీగా నియమితులయ్యారు. ట్రంప్ క్యాంప్ లో కీలకంగా వ్యవహించారు. ఆయనకు అత్యంత నమ్మకస్తురాలిగా లీవిట్ కు పేరుంది. దాదాపు 18 నెలలుగా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలను నిర్వర్తిస్తూ వచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ చివరి వారంలో ఆమె సెలవుల్లో వెళ్లారు. మే లో రెండో సంతానంగా ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈ సెలవుల తర్వాత తిరిగి ఇటీవలే విధుల్లో చేరారు.వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీగా అవసరమైన సమయం, శ్రద్ధను కేటాయిస్తూనే తల్లిగా ఇద్దరు పిల్లల పట్ల బాధ్యతలను నెరవేర్చడం అత్యంత కష్టంగా మారిందని లీవిట్ ఎక్స్ లో పేర్కొన్నారు. ఇద్దరు పిల్లలు, కుటుంబానికి ఎక్కువ సమయాన్ని కేటాయించాలనే ఉద్దేశంతో ప్రెస్ సెక్రెటరీ పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని వివరించారు. ఏడాదిన్నర కాలంగా వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీగా పనిచేయడం నా జీవితంలో లభించిన ఒక గొప్ప గౌరవం, సాహసం అని ఆమె అభివర్ణించారు.

# ప్రజల చేత.. ప్రజల కొరకు.. ప్రజాస్వామ్యం

- ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు కాదు..
- ప్రజల హక్కులు, స్వేచ్ఛలు, జవాబుదారీతనాన్ని కాపాడే వ్యవస్థ
- వై.ఎల్. అశోక్, సీనియర్ జర్నలిస్టు






**హైదరాబాద్,ఆగస్టు,13, మెదక్ టుడే న్యూస్:** 'డెమోస్' అంటే ప్రజలు, 'క్రాటోస్' అంటే పాలన అనే ప్రాచీన గ్రీకు పదాల నుంచి 'డెమోక్రసీ'అనే పదం వచ్చింది.అంటే ప్రజల పాలన.ప్రజాస్వామ్యంలో రాజకీయాధికారం అంతిమంగా ప్రజలదే. ప్రతి పౌరుడికి ఓటు హక్కు, ఎన్నికల్లో పోటీ చేసే హక్కు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, ప్రజా వ్యవహారాల్లో భాగస్వామ్యం అయ్యే హక్కు ఉంటాయి.ప్రజాస్వామ్య వ్యవస్థ పౌరుల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛలకు రక్షణగా నిలవాలి. భావ ప్రకటనా స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు వంటి రాజ్యాంగ హక్కులను కాపాడాలి. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి. న్యాయవ్యవస్థతో పాటు ఇతర రాజ్యాంగ సంస్థలు అధికార దుర్వినియోగాన్ని అడ్డుకునే స్వతంత్ర వ్యవస్థలుగా పనిచేయాలి.అందువల్ల ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం మాత్రమే కాదు.చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో పాలన సాగించడం కూడా ప్రజాస్వామ్యానికి అంతర్భాగమే.

### బూర్జువా ప్రజాస్వామ్యంపై మార్క్సిస్టు విశ్లేషణ

మార్క్సిస్టు సిద్ధాంతంలో పెట్టుబడిదారీ వ్యవస్థలోని ప్రజాస్వామ్యాన్ని విశ్లేషించేందుకు 'బూర్జువా ప్రజాస్వామ్యం' అనే పదాన్ని ఉపయోగిస్తారు. మార్క్సిస్టు ఆలోచనాపరుల ప్రకారం, ఇటువంటి వ్యవస్థలు సార్వత్రిక ఓటు హక్కు, ఎన్నికల్లో పాల్గొనే అవకాశం,వాక్ స్వాతంత్ర్యం, సంఘ స్వేచ్ఛ వంటి హక్కులను కల్పించినప్పటికీ.. ఆర్థిక వ్యవస్థలోని ప్రధాన ఉత్పాదక వనరులు, సంపద, మీడియా, రాజకీయ ప్రభావంపై ఆర్థికంగా శక్తిమంతమైన వర్గాల ఆధిపత్యం కొనసాగుతుందని వారు విశ్లేషిస్తారు.సంపద కేంద్రీకరణ, మీడియాపై ప్రభావం, లాబీయింగ్, ఆర్థిక వనరుల ఆధిపత్యం వంటి అంశాలు రాజకీయ నిర్ణయ ప్రక్రియను ప్రభావితం చేసే అవకాశం ఉందని మార్క్సిస్టు విశ్లేషణ చెబుతుంది. అందువల్ల రాజకీయ ప్రజాస్వామ్యంతో పాటు ఆర్థిక ప్రజాస్వామ్యం కూడా అవసరమని ఆ సిద్ధాంతం వాదిస్తుంది.

### భారతదేశంలో ప్రజాస్వామ్య వికాసం

భారతదేశంలో ప్రజాస్వామ్య భావనకు చారిత్రకంగా వివిధ రూపాలు కనిపిస్తాయి. కొంతమంది చరిత్రకారులు ప్రాచీన భారతదేశంలోని గణసంఘాలు, మహాజనపదాల్లోని కొన్ని పాలనా పద్ధతులను ప్రజల భాగస్వామ్యానికి సంబంధించిన తొలి రూపాలుగా పేర్కొన్నారు. కాలక్రమేణా ఈ భావనలు ఆధునిక రాజ్యాంగ ప్రజాస్వామ్యంగా పరిణామం చెందాయి.స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ తదితర నాయకులు ప్రజల భాగస్వామ్యం,రాజకీయ హక్కుల ప్రాధాన్యాన్ని నొక్కిచెప్పారు.మరోవైపు కమ్యూనిస్టు ఉద్యమకారులు, భగత్‌సింగ్ వంటి విప్లవకారులు రాజకీయ ప్రజాస్వామ్యంతో పాటు ఆర్థిక అసమానతలను తగ్గించి, ప్రధాన ఉత్పాదక రంగాలపై ప్రజాస్వామ్య నియంత్రణ అవసరమని వాదించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగం స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలకు పునాది వేసింది. లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకు రాజ్యాంగం బలమైన పునాదులను కల్పించింది.దశాబ్దాలుగా కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు మారినప్పటికీ భారత ప్రజాస్వామ్య వ్యవస్థ తన ప్రయాణాన్ని కొనసాగించింది.

### ప్రజాస్వామ్య సంస్థలపై పెరుగుతున్న ఆందోళనలు

అయితే ఇటీవలి సంవత్సరాల్లో దేశంలోని ప్రజాస్వామ్య సంస్థల పనితీరు, స్వతంత్రతపై వివిధ వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ పాలనలో అధికార కేంద్రీకరణ,రాజ్యాంగ సంస్థల స్వతంత్రత, పౌర స్వేచ్ఛలు,మీడియా స్వేచ్ఛ వంటి అంశాలపై ప్రతిపక్షాలు, పౌరసమాజ సంస్థలు,మానవ హక్కుల కార్యకర్తలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.ప్రభుత్వ విధానాలను విమర్శించే కార్యకర్తలు, జర్నలిస్టులు, మేధావులు, ప్రతిపక్ష నాయకులపై వివిధ చట్టాల కింద కేసులు నమోదు కావడం, దీర్ఘకాలం న్యాయపోరాటాలు కొనసాగడం ప్రజాస్వామ్య స్వేచ్ఛలపై చర్చకు దారితీస్తోంది.ఉమర్ ఖాలిద్ కేసు, స్టాన్ స్వామి వ్యవహారం, సుధా భరద్వాజ్, ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా వంటి కేసులు ఈ చర్చలో తరచూ ప్రస్తావనకు వస్తున్నాయి. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, అణగారిన వర్గాల హక్కుల కోసం పనిచేయడం నేరంగా మారకూడదనే వాదన కూడా ఈ సందర్భంలో ముందుకు వస్తోంది.అయితే తీవ్ర నేరాల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు, న్యాయస్థానాల తీర్పులు వంటి అంశాలను కూడా రాజ్యాంగబద్ధమైన న్యాయ ప్రక్రియలోనే చూడాలి. నేరారోపణకు గురైన ప్రతి వ్యక్తికి న్యాయపరమైన విచారణ, రక్షణ హక్కు, చట్టం ముందు సమానత్వం వంటి రాజ్యాంగ హక్కులు ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకం.

### ప్రజాస్వామ్యానికి బలమైన సంస్థలే రక్షణ

ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే ఎన్నికలు మాత్రమే సరిపోవు. స్వతంత్ర న్యాయవ్యవస్థ, స్వేచ్ఛాయుత మీడియా, పారదర్శక ఎన్నికల వ్యవస్థ, బలమైన పార్లమెంటరీ సంప్రదాయాలు, స్వతంత్ర రాజ్యాంగ సంస్థలు, చైతన్యవంతమైన పౌర సమాజం అవసరం.అలాగే అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉండాలి. ప్రతిపక్షానికి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉండాలి. జర్నలిస్టులు భయపడకుండా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలి. ప్రజా ఆస్తులు, సహజ వనరులు, ఆర్థిక విధానాలపై ప్రజలకు సమాచారం అందుబాటులో ఉండాలి.ప్రజాస్వామ్యం అంటే మెజారిటీ పాలన మాత్రమే కాదు.. మైనారిటీ హక్కులకు రక్షణ కూడా. ప్రజాస్వామ్యం అంటే అధికారంలో ఉన్నవారిని ఎన్నుకోవడం మాత్రమే కాదు.. ఆ అధికారాన్ని ప్రశ్నించే హక్కును కాపాడుకోవడం కూడా.2026 జూన్ 22న పంజాబ్‌లో ఫాసిజం వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో వివిధ సంస్థలు జిల్లా కేంద్రాల్లో సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించినట్లు వెల్లడైంది. నిరంకుశ ధోరణులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.చరిత్ర మనకు ఒక విషయం స్పష్టంగా చెబుతోంది. ప్రజాస్వామ్యం ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉన్నప్పుడే బలంగా ఉంటుంది.ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం.. ప్రజల కొరకు పనిచేసే ప్రభుత్వం.. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యానికి అసలైన అర్థం చేకూరుతుంది.అందుకే ప్రజాస్వామ్యాన్ని కేవలం ఓటు వేసే రోజుకు పరిమితం చేయకుండా.. ప్రతిరోజూ ప్రజల హక్కులను, స్వేచ్ఛను, సమానత్వాన్ని, న్యాయాన్ని కాపాడే జీవన విధానంగా మార్చాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉంది.ప్రజల చేత.. ప్రజల కొరకు.. ప్రజల పాలన సాగినప్పుడే ప్రజాస్వామ్యం సార్థకమవుతుంది.

# గీతంలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ

**నూతన విద్యార్థులను స్వాగతించిన స్కూల్ ఆఫ్ బిజినెస్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యుమానిటీస్**






**పటాన్ చెరు, ఆగస్టు 13:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ బిజినెస్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 2026–27 బ్యాచ్ కు ఘనంగా ఫ్రెషర్స్ పార్టీని నిర్వహించి, నూతన విద్యార్థులను ఘనంగా స్వాగతించాయి.సంగీతం, నృత్యం, స్కిట్లు, ర్యాంప్ వాక్ లు, విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో గీతం ప్రాంగణమంతా కళకళలాడింది. ఫుడ్ స్టాల్స్, ఆటలు, ఫోటోబూత్ లు పండుగ వాతావరణాన్ని మరింత పెంచాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఫ్రెషర్స్ కు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, తోటి విద్యార్థులు, సీనియర్లతో మమేకమవ్వడానికి ఒక అవకాశాన్ని కల్పించాయి. విద్యార్థులు నేర్చుకోవడానికి, ఒకరితో ఒకరు మమేకమవ్వడానికి, తమను తాము వ్యక్తీకరించుకోవడానికి, చిరస్మరణీయమైన జ్ఞాపకాలను నిర్మించుకోవడానికి ప్రోత్సహించే ఉత్సాహభరితమైన ప్రాంగణ వాతావరణాన్ని సృష్టించాలనే గీతం నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబించింది.తమ విశ్వవిద్యాలయ ప్రయాణానికి ఒక చిరస్మరణీయమైన ఆరంభాన్ని అందించినందుకు ఫ్రెషర్స్ తమ సీనియర్లకు కృతజ్ఞతలు తెలియజేయడంతో, ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# ముత్యంరెడ్డి కృషి మరువలేనిది: వడ్ల నవీన్ కుమార్

- చేగుంటను విద్యా హబ్ గా తీర్చిద్దిన ఘనత మాజీ మంత్రిదే



**చేగుంట, ఆగస్టు 13 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల కేంద్రంలోనిస్థానిక టి జి ఎం ఎస్ మోడల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ చంద్రకళ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ మాట్లాడుతూ చేగుంటలో మోడల్ స్కూల్, పాలిటెక్నిక్, స్పోర్ట్స్ స్కూల్, జూనియర్ కళాశాల వంటి విద్యా సంస్థలను అందించి విద్యా హబ్ గా తీర్చిద్దిన ఘనత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి దేనని కొనియాడారు.విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి చేగుంట పేరు, తమ తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉపసర్పంచ్ రఫీ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరు జర్నలిస్టుల ఐక్యతకు రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు

- త్వరలో పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిద్దాం: కే. విరహత్ అలీ
- విరాహత్ ఆలిని మర్యాదపూర్వకంగా కలిసిన పటాన్చెరు నూతన కార్యవర్గం





**పటాన్‌చెరు ఆగస్టు 13:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** టీయూడబ్ల్యూజే–ఐజేయూ పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీని గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని యూనియన్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన, పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి నరసింహ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీ మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన జర్నలిస్టుల సమావేశం కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతమై రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని ప్రశంసించారు. సంఘం పట్ల జర్నలిస్టుల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా కార్యవర్గం పనిచేసిందని కొనియాడారు.టీయూడబ్ల్యూజే–ఐజేయూ సంఘానికి 75 ఏళ్ల ఘన చరిత్ర ఉందని పేర్కొన్న ఆయన, క్రమశిక్షణకు మారుపేరైన ఈ సంఘంలో ప్రతి జర్నలిస్టు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పదవి అనేది అధికారం కాదని, అది ఒక బాధ్యత మాత్రమేనని అన్నారు. అహంకారానికి దూరంగా ఉండి సేవాభావంతో పనిచేసినప్పుడే పదవికి గౌరవం లభిస్తుందని తెలిపారు.త్వరలో రాష్ట్రస్థాయి సమావేశాన్ని పటాన్‌చెరులో భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అందుకు స్థానిక కార్యవర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పటాన్‌చెరుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆ ప్రాంతం ప్రత్యేక అనుభూతి కలిగి ఉందని, ఆ ప్రాముఖ్యతను మరింత పెంచేలా నూతన కార్యవర్గం పనిచేయాలని సూచించారు. సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు.యూనియన్ కోసం నిస్వార్థంగా కష్టపడే ప్రతి కార్యకర్తను నాయకత్వం గుర్తిస్తుందని, వారి సేవలను ఎల్లప్పుడూ గౌరవిస్తుందని విరహత్ అలీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్, రాష్ట్ర కమిటీ నాయకులు అబ్దుల్ బాసిత్, జిల్లా ఉపాధ్యక్షుడు పర్చ శ్రీనాథ్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ భూపాల్ రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షులు శివకుమార్, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు శేఖర్, పురుషోత్తం, శ్రీనివాస్, సిద్ధు పాల్గొన్నారు.

# ప్రైవేట్ బస్సును ఢీకొన్న కంటైనర్ లారీ.. ఇద్దరు మహిళల మృతి

**నిజామాబాద్, ఆగస్టు 13:** జిల్లాలోని ఆర్మూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గోవింద్‌పేట్ ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును కంటైనర్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. ప్రైవేటు బస్సు టైర్ పంక్చర్ అవడంతో బస్సును డ్రైవర్ రోడ్డుపై నిలిపాడు. ఈ క్రమంలో ఇద్దరు మహిళలు బస్సు ఎదుట ఉన్న డివైడర్‌పై కూర్చుకున్నారు. ఇదే సమయంలో అతివేగంతో దూసుకొచ్చిన కంటైనర్ లారీ.. వెనుక నుంచి బస్సును ఢీకొట్టింది.ఈ క్రమంలో బస్సు ముందు డివైడర్‌పై కూర్చున్న మహిళలపైకి బస్సు టైర్ ఎక్కడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మహిళల మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కొల్చారం మండలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**- మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రూ.10 వేల జరిమానా**



**కొల్చారం, ఆగస్టు 13**
మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా గల ఎన్‌హెచ్--765డీ రహదారిపై గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. కొల్చారం ఎస్ఐ అహ్మద్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.
ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, వారిని మెదక్ కోర్టులో హాజరుపరిచారు. ఈ క్రమంలో విక్రమ్ కుమార్, తండ్రి మనోహర్ రావుకు కోర్టు రూ.10,000 జరిమానా విధించింది.మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా తమతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని ఎస్ఐ అహ్మద్ మొహియుద్దీన్ సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# తుక్కాపూర్ విద్యార్థులకు ఉచిత స్పోర్ట్స్ డ్రెస్

**-- ఉదారత చాటుకున్న ఉపసర్పంచ్ ఆరే రవీందర్**

**కొల్చారం, ఆగస్టు 13 ( మెదక్ టుడే న్యూస్ ):**
మెదక్ జిల్లా కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ ఉపసర్పంచ్ ఆరే రవీందర్ ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేసి తన ఉదారతను చాటుకున్నారు.జనవరి 26న పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఉపసర్పంచ్ రవీందర్, ఈ ఏడాది ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సుమారు రూ.20 వేల విలువైన స్పోర్ట్స్ డ్రెస్‌లను విద్యార్థులకు ఉచితంగా అందించారు.విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు రవీందర్ తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌లు అందించడం పట్ల గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో తుక్కాపూర్ సర్పంచ్ ఆంజనేయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు




గణేష్, ఉపాధ్యాయురాలు ప్రమీల, వార్డు సభ్యులు గంగయ్య, సుధాకర్, మమత, శ్రీనివాస్, గ్రామ పెద్దలు అంబాజీరావు,




లింగప్ప, మల్లప్ప, సిద్ధప్ప, సిద్దు, మల్లయ్య, టేక్మాల్ మల్లప్ప తదితరులతో పాటు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సమీక్షలో ప్రజా సమస్యలు

**- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సర్పంచులు**





**మెదక్ టుడే న్యూస్ ఆగస్టు :-13** మెదక్ జిల్లా ప్రతినిధి పి. దుర్గేష్ గౌడ్ పాపన్నపేట, గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై గురువారం పాపన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన సమీక్ష సమావేశం వాడీవేడిగా సాగింది. డీఎల్‌పీవో యాదయ్య, ఎంపీడీవో విష్ణువర్ధన్ సమక్షంలో జరిగిన సమావేశంలో పలువురు సర్పంచులు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మెన్లకు గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ఫోన్ చేసినప్పటికీ స్పందించడం లేదని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుర్తివాడ గ్రామంలోని పలు వార్డులకు మిషన్ భగీరథ నీరు అందడం లేదని, ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని సర్పంచ్ శ్రీధర్ వాపోయారు.పాపన్నపేట, రామతీర్థం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని సర్పంచులు పావని, నరేందర్‌గౌడ్, సాయి రెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. నూతన నీటి ట్యాంకులు నిర్మించి, పైపులైన్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.మండలంలో 699 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 173 ఇళ్లు పూర్తయ్యాయని, మిగతావి నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఏడుపాయల కమాన్, యూసుఫ్‌పేట, కొత్తపల్లి బ్రిడ్జి, ఎల్లాపూర్ బ్రిడ్జి వద్ద వర్షాలు కురిసిన సమయంలో రహదారులపై ప్రయాణం కష్టంగా మారుతోందని సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఆర్అండ్‌బీ అధికారి తెలిపారు.దౌలాపూర్ గ్రామంలో పలువురు రైతులకు భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలు లేక యూరియా పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు తెలిపారు. ఆయా భూములకు సంబంధించి కోర్టు కేసులు ఉండటంతో సమస్య నెలకొన్నదని అధికారులు వెల్లడించారు.మండలంలో మొత్తం 26,456 ఎకరాలు సాగులో ఉండగా.. 26,212 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్లు ఏవో శ్రీనివాస్‌రాజు తెలిపారు. మిగిలిన భూ ముల్లో పత్తి, కంది, పెసర, చెరకు, కూరగాయలు సాగు చేస్తున్నా రని వివరించా రు.ఏడుపాయల కమాన్ నుంచి దేవస్థానం వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రహదారి నిర్మాణాలకు నిధులు కేటాయించామని, హమ్ గ్రాండ్ కింద కూడా పలు గ్రామాల్లో రహదారులు నిర్మించనున్నట్లు పేర్కొ న్నారు.రామతీర్థం ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు లేక మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ సాయి రెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామని అధికారులు తెలిపారు. అలాగే గ్రామంలో చాలామందికి జాబ్ కార్డులు లేవని సర్పంచులు ఇన్‌చార్జి ఏపీవో యాదగిరి దృష్టికి తీసుకెళ్లగా, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశానికి ఆర్టీసీ అధికారులు మినహా మిగతా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరయ్యారు. తహశీల్దార్ సతీష్‌కుమార్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచులు వెంకటేశం, శ్రీనివాస్, రాణెమ్మ, పంకజ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 18 మందికి ఉచిత కంటి పరీక్షలు

**- పేదల కంటి సమస్యలకు మేమే భరోసా రాజనకు రామచంద్రం**



**చేగుంట, ఆగస్టు 13 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండల కేంద్రంలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో స్థానిక ఐశ్వర్య ఐ కేర్‌బినందు ఆప్తమాలజిస్ట్ శిరీష ఆధ్వర్యంలో ఉచిత పర్మనెంట్ కంటి పరీక్షా కేంద్రం నిర్వహించారు.ఈ శిబిరంలో 18 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాజనకు రామచంద్రం మాట్లాడుతూ "సర్వేంద్రియానాం నయనం ప్రధానం" అనే సూక్తితో ప్రతి ఒక్క పేదవారికి కంటి సమస్యలు లేకుండా చూడడమే మా బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రచనకు రామచంద్రం, సెక్రటరీ బుర్కా నాగరాజు, ట్రెజరర్ దుర్గం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల వాసికి తెలుగు వర్సిటీ ప్రతిష్ఠాత్మక సాహితీ పురస్కారం



**రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/ఆగస్టు 13**
శ్రీమద్రామాయణంకు 2024 సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ కవి,తెలంగాణ గవర్నర్ జాయింట్ సెక్రటరీ,సీనియర్ గ్రూప్-1 అధికారి శశికిరణ్ కొమాండూర్ రచించిన పద్య మహాకావ్యం శ్రీమద్రామాయణం ప్రతిష్ఠాత్మక 2024 సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైంది. పరిపాలనా బాధ్యతలను నిర్వర్తిస్తూనే గత రెండు దశాబ్దాలుగా సాహిత్య సాధన కొనసాగిస్తున్న శశికిరణ్ కొమాండూర్. .సామాన్య పాఠకుడికి సైతం సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో,ఛందోబద్ధంగా శ్రీమద్రామాయణంను రచించారు. ప్రముఖ ప్రచురణ సంస్థ ఎమెస్కో ఈ మహాకావ్యాన్ని ప్రచురించింది.సాహిత్య రంగంలో తనదైన ముద్ర వేస్తూనే,వ్యక్తిగత జీవితంలోనూ నైతిక విలువలు,నిజాయితీకి ప్రాధాన్యమిచ్చే అధికారిగా శశికిరణ్ కొమాండూర్‌కు సహచర అధికారుల్లో మంచి గుర్తింపు ఉంది. గతంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం కోసం ఆయన పేరు పరిశీలనకు వచ్చినప్పటికీ, అప్పట్లో తాను సంబంధిత కేంద్ర మంత్రి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నం దున,పదవిలో ఉన్న సమయంలో తన శాఖకు సంబంధించిన పురస్కారాన్ని స్వీక రించడం నైతికంగా సముచితం కాదని భావించి ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించారు.నైతిక విలువలకు ప్రాధాన్యమిస్తూ సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న శశికిరణ్ కొమాండూర్‌కు తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కా రంలభించడంపట్లకవులు, రచయితలు, సాహితీవేత్తలు, ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.లోక్ భవన్‌లో ఘన సత్కారం తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైన శశికిరణ్ కొమాం డూర్‌ను లోక్ భవన్‌లో గ్రూప్-1 అధికా రుల సంఘం,లోక్ భవన్ అధికారులు ఘనంగా సత్కరించారు. అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్,గవర్నర్ ఉప కార్యదర్శి జి.పల్లవి,ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం,సమన్వయ అధికారి మురళీచార్యులు,అకౌంట్స్ ఆఫీసర్ శైలజ,అసిస్టెంట్ కంప్ట్రోలర్ జెడ్. హెరాల్డ్ డేవిడ్,ఉద్యానవన అధికారిణి మాలిని,డీఈఈ శ్రీధర్, సెక్షన్ ఆఫీసర్ ఎస్. రామచంద్రం, సాంఖ్యక అధికారి శ్రీకాంత్,ఏఈఈలు హర్షవర్ధన్, త్రిష తదితరులు శశికిరణ్ కొమాండూర్‌ను సత్కరించి అభినందించారు.లోక్ భవన్ అధికారులు,ఉద్యోగులు, సిబ్బంది ప్రత్యేకంగా శశికిరణ్ కొమాండూర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కొత్తపల్లి గ్రామం నుంచి సాహిత్య రంగంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే దిశగా సాగుతున్న శశికిరణ్ కొమాండూర్‌కు తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల స్వగ్రామం,జిల్లా వాసులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 'సర్'లో సొంతూళ్లకే మొగ్గు



**వరంగల్:** ప్రత్యేక ఓటరు సవరణ జాబితా(ఎస్ఐఆర్) ప్రక్రియలో పట్టణాల్లో ఉంటున్న పల్లెవాసులు తమ ఓటు హక్కును పల్లెల్లో ఉంచుకోవడానికే ప్రాధాన్యతనిచ్చారు. ఈ నెల 10వతేదీతో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసిన సందర్భంగా ఎన్నికల సంఘం విడుదల చేసిన వివరాల్లో పట్టణాల్లోని అధిక ఓట్లు శాశ్వతంగా మార్చుకున్నట్లు వెల్లడైంది.వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలలో అధికంగా గ్రామీణ ప్రాంతా ల నుంచి పిల్లల చదువు, వ్యాపారం, ఉద్యోగం, ఉపాధి కోసం వచ్చిన వారు ఇంతకాలం తమ సొంత ఊళ్లలో, పట్టణ ప్రాంతంలో రెండు చోట్ల ఓట్లు వేసేవారు.ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ఎస్ఐఆర్‌తో పట్టణాల్లో ఉంటున్న వారంతా తమ ఓటును తమ సొంత ఊళ్లలో ఉండేలా చూసుకున్నారు. ఎందుకంటే గ్రామా ల్లో ఓటు హక్కు ఉన్నట్లయితే తమకు రావా ల్సిన అన్ని రకాల ప్రభుత్వ పథకాలు, రైతు బంధు, ఉపాధి హామీ లాంటి అనేక పథకాలు వస్తాయని, లేదంటే అవన్నీ కోల్పోయే ప్రమాదముందని గ్రహించారు. పట్టణాల్లో ఉంటున్నా పల్లెల్లోనే ఓటు హక్కు ఉండేలా తమ ఓటును ఎస్ఐఆర్‌లో పర్మినెంట్ షిఫ్టింగ్ చేసుకున్నారు. దీంతో అటు పట్టణాల్లో ఇటు పల్లెల్లో వేసే డబుల్ ఓటింగ్‌కు అడ్డుకట్టపడిం ది. పర్మినెంట్ షిఫ్టింగ్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి అత్యధిక ఓటర్లు ఉన్నారు.ష్ట్రఅని2.2.యజూస్త్రఅందులో వరంగల్ తూర్పు నియోజకవర్గం లో మొత్తం 2,60,437 మంది ఓటర్లు ఉండగా అందులో 30,411 మంది పర్మినెంట్ షిఫ్టింగ్ చేసుకున్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,76,272 ఉండగా, అందులో 18,307 మంది ఓటర్లు పర్మినెంట్‌గా తమ ఓటును షిఫ్టింగ్ చేసుకున్నారు. అదేవిధంగా నర్సంపేట నియోజకవర్గంలో ం ఓటర్లు 2,40,244 ఉండగా అందులో 7,857 మంది ఓటర్లు పర్మినెంట్ షిఫ్టింగ్ చేసుకున్నారు.

# అవయవ దానం అన్ని దానాల్లోకెల్లా ఒక గొప్ప దానం...!

**- జనగామ జిల్లా చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీందర్...!!**

**జనగామ జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఆగస్టు 13 :**
గురువారం రోజున " అవయవ దాన దినోత్సవం " సందర్భంగా జనగామ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్ కార్యదర్శి-ఆదేశాలతోషామీర్పేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో... పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ పద్మ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో... జనగామ జిల్లా చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "మనిషి మరణించిన తరువాత కూడా మరొకరి జీవితంలో వెలుగును నింపగలగడం కంటే గొప్ప మానవతా సేవ మరొకటి ఉండదు అని పేర్కొన్నారు. ఒక వ్యక్తి అవయవ దానం ద్వారా గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కళ్ల వంటి అవయవాలను అవసరమైన వారికి అందించడం ద్వారా



అనేకమంది ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు. "న్యాయ సేవా సంస్థల పరంగా కూడా ప్రజలకు వారి చట్టపరమైన హక్కులు, అవయవ దానానికి సంబంధించిన విధానాలు, కుటుంబ సభ్యుల పాత్ర గురించి అవగాహన కల్పించే దిశగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రజా సమూహాల్లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు అని దీనికి ప్రతి ఒక్కరి సహకారం "ఒకరి జీవితానికి ముగింపు వచ్చినా, మరొకరి జీవితానికి కొత్త ఆరంభం, మన సమాజంలో అవయవ దానం గురించి ఇంకా అనేక అపోహలు, భయాలు ఉన్నాయి. అవగాహన లేకపోవడం వల్ల ఎంతోమంది అవసరమైన అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారు అని తెలిపారు. అందువల్ల అవయవ దానం గురించి శాస్త్రీయమైన మరియు వాస్తవమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం కాబట్టి, అవయవ దానం పై ఉన్న అపోహలను తొలగించి, శాస్త్రీయ అవగాహనను పెంపొందించేలా. కార్యాచరణను రూపొందించాలని అన్నారు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురా లు పద్మ "అవయవ దానం కేవలం వైద్యపరమైన అంశంతో పాటు ఇది మానవత్వం, దాతృత్వం మరియు సామాజిక బాధ్యతకు ప్రతీక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల రవీందర్, పి ఎల్ వి రాజశేఖర్, ప్రధానోపాధ్యా యురాలు, ఉపాధ్యాయులు విద్యార్థులు, డిఎల్ఎస్ సూపర్డెంట్ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

# దాడి చేసింది ఎవరు.. కేసులు పెట్టింది ఎవరిపై.?

- ●కల్తీ ఆహారంపై సమాచారం ఇవ్వడమే నేరమా.?
- ●జర్నలిస్టులపై కేసుల వెనుక ఎవరి హస్తం.?
- ●మాఫియా దాడులు, మహిళా జర్నలిస్టుపై దురుసు ప్రవర్తన..
- ●అయిన కేసులు మాత్రం రిపోర్టర్లపైనేనా.?







**హైదరాబాద్,ఆగస్టు,13, మెదక్ టుడే న్యూస్:** కల్తీ ఆహార పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆటో ట్రాలీ లో పన్నీర్ ప్యాకింగ్ చేస్తున్నారన్న సమాచారాన్ని అధికారులకు చేరవేసిన జర్నలిస్టులే చివరకు కేసుల పాలవడం ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది.

**దాడి చేసింది ఎవరు.? భయభ్రాంతులకు గురిచేసింది ఎవరు.?**

హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8 లోని బృందావన్ కాలనీ రోడ్ నెం.2లో పన్నీర్ వ్యవహారంలో ఎవరు ఎవరిని దూషించారు, ఎవరిపై దాడి చేశారు. అసభ్య పదజాలంతో దూషించింది ఎవరు.? చివరకు కేసులు ఎదుర్కొంటున్నది ఎవరు.? అన్న ప్రశ్నలు ప్రజలలో వినిపిస్తున్నాయి. హబ్సిగూడ స్ట్రీట్ నంబర్--8, బృందావన్ కాలనీ రోడ్ నెం.2లో రోడ్డుపై పన్నీర్ ప్యాకింగ్ చేస్తున్నారన్న సమాచారం జర్నలిస్టులకు అందడంతో వారు అక్కడికి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీసినట్లు తెలుస్తోంది. అనంతరం పోలీసు అధికారులు, ఫుడ్ ఇన్స్పెక్టర్లకు సమాచారం అందించారు. సంబంధిత అధికారులు వచ్చే వరకు కొంత దూరంలో వేచి ఉన్నారని సోషల్ మీడియాలో తిరుగుతున్న వీడియో చూస్తే అర్థమవుతోంది. కల్తీ ఆహారంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడకుండా చూడాలన్న సామాజిక బాధ్యతతోనే అధికారులకు సమాచారం అందించామని జర్నలిస్టులు తెలిపారు.అయితే అధికారులు వచ్చే వరకు అక్కడ వేచి ఉన్న జర్నలిస్టులపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడిన వీడియోలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టడంతో ఇప్పుడు సంచలనంగా మారాయి. జర్నలిస్టులను అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, వారిపై చేయి చేసుకోవడం, తోసి వేయడం, మహిళా జర్నలిస్టుపై కూడా దాడి చేసి, ఆమె ఫోన్ లాక్కొని పలు రకాల ఇబ్బందులకు గురిచేయడం వీడియోలలో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వ్యవహారం మరింత చర్చనీయాంశమైంది.

**వీడియోలో కనిపించలేదా.? దాడి ఎవరు చేశారో తెలియదా.?**

జర్నలిస్టుల ఆరోపణల ప్రకారం దాడి, అసభ్య పదజాలలతో దుర్భాషలు, బెదిరింపులకు సంబంధించిన వీడియోలు ఉన్నప్పటికీ వాటిని పరిశీలించకుండానే, ప్రాథమిక విచారణ పూర్తికాకుండానే జర్నలిస్టులపై ఆగమేఘాల మీద కేసులు నమోదు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కల్తీ వ్యవహారాలను అడ్డుకోవాలని అధికారులకు సమాచారం ఇచ్చినందుకు కేసుల బహుమతా.? అంటూ జర్నలిస్టు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

కల్తీ పన్నీర్ దందాను కట్టడి చేయాల్సిన బాధ్యత ఫుడ్ సేఫ్టీ అధికారులది కాదా.? పోలీసు శాఖకు సమాచారం అందితే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసులది కాదా.? మరి అధికారులు తమ పని చేయకుంటే, జర్నలిస్టులుగా సమాచారం అందించకపోతే కల్తీ ఆహార దందాలు వెలుగులోకి వచ్చేది ఎలా.? ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యవహారాలను బయటకు తీసుకురావడం కూడా పోలీసు అధికారులు నేరంగా పరిగణిస్తే, భవిష్యత్తులో అవినీతి అక్రమాలపై ప్రశ్నించడానికి జర్నలిస్టులు ముందుకు వస్తారా.?

**'మాకెందుకులే' అనుకుంటే జర్నలిజానికి అర్థమేంటి.?**

ఇలాంటి ఘటనలు జర్నలిస్టుల్లో భయాన్ని పెంచే ప్రమాదం ఉంది. అవినీతి, అక్రమాలు బయటపెడితే కేసులు.. ప్రశ్నిస్తే బెదిరింపులు.. వాస్తవాలు రాస్తే దాడులు అనే పరిస్థితి ఏర్పడితే జర్నలిస్టులు ఇకపై కేవలం ప్రెస్‌నోట్లు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల వార్తలకే పరిమితమయ్యే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత అధికారులు గుర్తించాలి. సమాజంలో జరుగుతున్న తప్పులను, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే జర్నలిజం ప్రధాన బాధ్యత.

అందుకే ఈ వ్యవహారంలో దాడి చేసింది ఎవరు.? జర్నలిస్టులను ఎవరు బెదిరించారు.? మహిళా జర్నలిస్టుపై దురుసుగా ప్రవర్తించింది ఎవరు.? అనే అంశాలపై రాష్ట్ర డిజిపి,







హైదరాబాద్ నగర సీపీ పూర్తిస్థాయి విచారణ చేయించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో జర్నలిస్టులపై నమోదైన కేసుల విషయంలోనూ వీడియో ఆధారాలు, ప్రత్యక్ష సాక్ష్యాలు, ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి.

**డీజీపీ, సీపీ స్పందించాలి**

ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జర్నలిస్టులపై జరిగిన ఘటనపై తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ సీపీ ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయి నిష్పక్షపాత విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని జర్నలిస్టులు, జర్నలిస్ట్ సంఘాలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. కల్తీ ఆహారాన్ని అరికట్టేందుకు సమాచారం అందించే వారిని రక్షించాల్సింది పోయి, వారినే నిందితులుగా నిలబెట్టే పరిస్థితి ఏర్పడితే అది ప్రజల్లో తప్పుడు సంకేతాలను పంపే ప్రమాదం ఉంది.

> **కల్తీపై పోరాటం చేసేవారికి రక్షణ కావాలి.. అక్రమాలను బయటపెట్టేవారికి కేసుల భయం కాదు. దాడి చేసిన వారిపై చర్యలు ఎప్పుడు.? జర్నలిస్టులపై కేసులు ఎందుకు.? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉంది.**

## తప్పనిసరిగా వృద్ధాప్య పింఛన్ల దరఖాస్తులను స్వీకరించాలి: మేడి హరికృష్ణ:



**చిట్యాల, ఆగస్టు 13** ప్రభుత్వ అధికారులు స్వీకరిస్తున్న పింఛన్ల దరఖాస్తుల్లో వృద్ధాప్య పింఛన్ల దరఖాస్తులను కూడా తప్పనిసరిగా స్వీకరించాలని ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ మేడి హరికృష్ణ ప్రకటన లో డిమాండ్ చేశారు. వృద్ధాప్యంలో ఆసరా కోసం ఎంతోమంది వయోవృద్ధులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. వారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వృద్ధాప్య పింఛన్ల కోసం కూడా దరఖాస్తులు సమర్పించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ప్రస్తుతం అధికారులు చేపడుతున్న పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో వృద్ధాప్య పింఛన్లను మినహాయించకుండా, అర్హులైన వృద్ధుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన ప్రతి వృద్ధుడికి పింఛన్ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు..

## కాంగ్రెస్ కమిటీల బలోపేతంపై కీలక సమావేశం





**ఘట్‌కేసర్, ఆగస్టు 13** మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని ఘట్‌కేసర్, జవహర్ నగర్, చంద్రపురి కాలనీ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే దిశగా కీలక సమావేశం నిర్వహించారు. డివిజన్ కమిటీలు, అనుబంధ సంఘాల అధ్యక్షుల పేర్ల సేకరణపై నాయకులు విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ ఎస్ ఐ ఆర్ ఇన్‌చార్జి గజ్జల కాంతం, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా డివిజన్ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయడం, అనుబంధ సంఘాలకు సమర్థవంతమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయడం, ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మరింత చేరువయ్యేలా కార్యాచరణ రూపొందించడంపై నాయకులతో చర్చించారు.అనుబంధ సంఘాల అధ్యక్షుల పేర్ల సేకరణ ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేసి, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయాలని నాయకులకు సూచించారు. ప్రతి విభాగంలో క్రియాశీలకంగా పనిచేసే నాయకులు, కార్యకర్తలను గుర్తించి బాధ్యతలు అప్పగించాల్సిన అవసరాన్ని వివరించారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.డివిజన్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండేలా కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు

## ధాన్యాలతో మువ్వన్నెల జెండా

### - చిత్రించి దేశభక్తిని చాటుకున్న రామకోటి రామరాజు



**గజ్వేల్ ఆగస్టు13** స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పప్పు ధాన్యాలతో మువ్వన్నెల జెండాను అద్భుతంగా రూపొందించి దేశభక్తిని చాటుకున్నారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినూతన ఆలోచనతో 3రకాల పప్పు ధాన్యాలను ఉపయోగించి రెపరెపలాడే మూడు రంగుల భారీ జెండాను చిత్రించానన్నారు. దైవభక్తి ముఖ్యమే అంతకన్నా ముందు దేశభక్తి కూడా ప్రతి వ్యక్తిలో కలిగినప్పుడే మన దేశం యొక్క గొప్పతనం తెలుస్తుందన్నారు. కాషాయంకు ఎర్రపప్పు, తెలుపుకు బియ్యం, ముదురు ఆకుపచ్చకు పెసర్లు ఉపయోగించానన్నారు.

## యూరియా సరఫరాకు పటిష్ట చర్యలు రైతులకు అధికారుల భరోసా

**రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/** గంభీరావుపేట మండలం కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో అధికారులు స్పందించి రైతులతో మాట్లాడారు.యూరియా సకాలంలో అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా గంభీరావుపేట తహశీల్దార్ మారుతి, వ్యవసాయ అధికారి సలావుద్దీన్,ఎస్ఐ శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు అజయ్,ప్రవీణ్, సొసైటీ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.తహశీల్దార్ మారుతి మాట్లాడుతూయూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.రైతులకు సకాలంలో యూరియా అందేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని చెప్పారు.యూరియా సరఫరాలో ఎలాంటి



అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపడతామని, సొసైటీలో ఉన్న స్టాక్ పూర్తయ్యేలోపే అవసరమైన యూరియాను లారీల ద్వారా తెప్పించి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.వ్యవసాయ అధికారి సలావుద్దీన్ మాట్లాడుతూరైతులకు అవసరమైన సమయంలో యూరియా అందేలా వ్యవసాయ శాఖ తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. సొసైటీలో యూరియా స్టాక్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, స్టాక్ తగ్గిన వెంటనే ముందస్తుగా లారీల ద్వారా కొత్త సరుకును తెప్పించేలా చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం అధికారులు రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, యూరియా సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు రైతులు కూడా అధికారులకు సహకరించాలని సూచించారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..